క్లుప్తంగా

విశేష అలంకరణలో కామాక్షమ్మ



గాజుల అలంకారంలో దర్శనమిస్తున్న కామాక్షమ్మ

పెనగలూరు : మండల కేంద్రంలో వెలసివున్న పూరాతన కాలంనాటి నైనాదీశ్వరస్వామి ఆలయంలో ఉన్న కామాక్షమ్మను గాజులతో అలంకరించారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేసినట్లు వేదపండితులు తెలియజేశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం

రైల్వేకోడూరు అర్బన్ : మహిళలు తమకాళ్లపై తాము నిలబడి ఆర్థికంగా ఎదగడానికి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణలో 100వ బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వడం ఆనందంగా వుందని మంగళవారం ట్రస్ట్ చైర్మన్ పార్థసారథి తెలిపారు. శిక్షణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. శిక్షణ ముగించుకొన్న ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

నివాళి



వెంకట లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆకేపాటి అనిల్‌రెడ్డి

సుండుపల్లె : మండల పరిధిలోని గుట్టకాడ బలిజపల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ కార్యకర్త రెడ్డిచర్ల ధనుంజయ తల్లి రెడ్డిచర్ల వెంకట లక్ష్మమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆకేపాటి అనిల్‌రెడ్డి గ్రామ చేరుకుని ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం ధనుంజయ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరిగెల సౌమిత్రి, చిన్నగొల్లపల్లె గ్రామ సర్పంచ్ రామ జయచంద్ర, పెంచల్ రెడ్డి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

'మానవత' శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సభ్యులు

చిట్వేలి : ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, సర్వమానవాళిలు శాంతితో జీవించాలనే నినాదంతో మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి పిలుపు మేరకు మానవత వారోత్సవాలలో భాగంగా మంగళవారం చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతికోసం ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్‌ల పర్యవేక్షణలో విద్యార్థులతో పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ చిట్వేలిశాఖ చైర్మన్ తిరుమల విశ్వనాథం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షులు మునిరావు, కార్యదర్శి సాయిరాం, కోశాధికారి రంగారెడ్డి, డైరెక్టర్ బోర్డు సభ్యులు సురేంద్ర రెడ్డి, శ్రీనివాసులు, ఏబీఎస్ ప్రసాద్, కావేరి చంద్ర, కాలేషా, వెంకటేశ్వర్లు, పెంచల్ దాస్, దుర్గారాజు, ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

నిందితులను ఉరితీయాలి



జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని రాయచోటి బీజేపీ నాయకులు, మానవత సేవ సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థులు, మానవత సేవ సంస్థ కుటుంబ సభ్యులతో కలసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రతిభ జూనియర్ కళాశాల నుంచి నేతాజీ సర్కిల్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మానవత సేవ సంస్థ అధ్యక్షులు సంచుల ఖాదర్ బాషా, వెంకటరమణ, చింతం వెంకట్రామిరెడ్డి, షకీల్, గంగాధర్ నాయుడు, గుండ్లపల్లె వెంకటేష్, సుబ్బయ్య స్వామి, భాను, వెంకట్రామ రాజు, జయచంద్ర, హరినాథరెడ్డిలు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలకే సమస్యల ఏకరువు

- నెలలు గడుస్తున్నా నియామకం కాని తహసీల్దార్ పోస్టు
- కోడూరు మండలంలో మొక్కుబడిగా గ్రీవెన్స్ సెల్
- సమస్యలు పరిష్కారం కాక ప్రజల అవస్థలు



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక తూతూమంత్రంగా సాగుతోంది. కార్యాలయంలో ఉన్న ఏకైక డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో మొక్కుబడిగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్నికల అనంతరం నూతన ప్రభుత్వం కొలువుదీరిన తరువాత స్పందనను ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)గా పేరు మార్చారు. గత రెండు నెలల నుంచి వివిధ వర్గాల ప్రజలు అందించిన ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో తమ సమస్యలు ఇంకెప్పుడు తీరుతాయోనంటూ ఆందోళనలో అర్జీదారులు ఆవేదన పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నా ఏ అధికారి తహసీల్దార్ కార్యాలయం వైపు రాకపోవడం విచిత్రం. గత ప్రభుత్వ హయాంలో స్పందన కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరిగేది. అన్ని శాఖల అధికారులు హాజరై పలు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం లభించేది.

నెలలు గడుస్తున్నా తహసీల్దార్ నియామకం..

ఇక్కడ ఎన్నికలకు వచ్చి విధులు నిర్వహించిన తహసీల్దార్ గత నెల 12 తేదీన బదిలీ అయ్యారు. రైల్వేకోడూరు మండల తహసీల్దార్ పోస్టింగ్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడకు రావాలంటే పెద్ద ఎత్తున పైరవీలు చేయాల్సిందేనని పలువురు చెవులు కొరుక్కుంటున్నారు. అదికాక అధికార పార్టీలకు చెందిన నాయకులు తనకు నమ్మకంగా చెప్పిన పని చేసే వారికి పోస్టింగ్ ఇప్పించడానికి పెద్ద ఎత్తున జరిగే ప్రయత్నంలో ఆలస్యమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా మండలానికి తహసీల్దార్ నియామకం చేపట్టి తమ సమస్యలు పరిష్కరించే దిశగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుకుంటున్నారు.

అధికారులు లేక.. ప్రజల అనాసక్తి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వారి సమస్యలను తహసీల్దార్‌కు తెలియజేసి వాటిని పరిష్కరించుకునేందుకు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. కోడూరు మండలంలో జరుగుతున్న రెవెన్యూ యంత్రాంగం, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు ఎవరూ ఉండకపోవడంతో ప్రజలు అర్జీలు చేసేందుకు వచ్చి నిరాశగా వెనుతిరుగుతున్నారు. అధికారులకు తమ సమస్యలను చెప్పుకొని వాటిని పరిష్కరించుకుందామనుకుంటే కార్యాలయాల్లో అధికారులు లేకపోవడంపై అర్జీదారులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు ప్రజా సమస్యలను పరిష్కారానికి దారి చూపే వేదికలా మార్చాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలను పరిష్కారించాలి



ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి. కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను పరిష్కరించే దిశగా అన్నిశాఖల అధికారులు హాజరై వాటిని పరిష్కరించాలి. మండలంలో తహసీల్దార్ నియామకమే జరగకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రభుత్వం, జిల్లా అధికారులు అధికారులను నియమించి వారికి తగిన ఆదేశాలు ఇచ్చినప్పుడే ప్రజలకు మంచి జరుగుతుంది.

\- శంకరయ్య, రైల్వేకోడూరు

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



ప్రజా సమస్యల పరిష్కార వేదిక సక్రమంగా జరుగకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సర్టిఫికెట్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా తహసీల్దార్ కార్యాలయంలో పని జరిగితే కానీ మన చేతికి అందదు. రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది లేక ఆలస్యంగా పనులు జరుగుతున్నాయి. చిన్న సర్టిఫికెట్ కోసం నెలల తరబడి వేచి ఉండేలా చేస్తుండంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. త్వరితగతిన ప్రజలకు సేవలందించేలా యంత్రాంగం కృషి చేయాలి.

\- సి.బాలసుబ్రమణ్యం, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి

ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిరామయ్య

రాజంపేట రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండి ఆదుకోవాలని తాలుకా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్(ఏపీజీఈఏ) అధ్యక్షులు యు.సిద్దిరామయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ సమావేశపు హాలులో మంగళవారం ఏపీజీఈఏ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు తక్షణమే పాత బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని కోరారు. ఐఆర్‌ను అందజేయాలని కోరారు. ప్రతి 6 నెలలకు డీఏను అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆకేపాడు పీహెచ్‌సీ వైద్యులు ఎస్.అశ్వినీచంద్ర, ఎంపీహెచ్ఈఓ నారాయణరాజు, పీహెచ్ఎన్ లక్ష్మినరసమ్మ, ఎంపీహెచ్ఎస్ ఎం.రవిశంకర్‌రాజు, ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ కవిత, జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ రమేష్, ఎఫ్ఆర్‌ఓ రవిశంకర్, పోలీ పంచాయతీ సెక్రటరీ కె.శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ సాదిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే ఔట్ల ప్లాట్లు కొనుగోలు చేయవద్దు



నల్లా రాంబాబు, మున్సిపల్ కమిషనరు

రాజంపేట : మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా వేసిన లేఔట్లలోని ఇంటి స్థలాలను కొనుగోలు చేయవద్దని రాజంపేట మున్సిపల్ కమిషనర్ నల్లా రాంబాబు మంగళవారం హెచ్చరించారు. పట్టణ పరిధిలోని సర్వేనెంబరు 1262, 1263, 1264లలో 2.61 విస్తీర్ణంలో వేసిన ప్లాట్స్‌కు ఎలాంటి అనుమతి లేదన్నారు. ఈ ప్లాట్‌కు అమ్మకం, కొనుగోలుపై రిజిస్ట్రేషన్ జరగదన్నారు. భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వరని వివరించారు. మౌలిక వసతులు కల్పించబోమని పేర్కొన్నారు.

స్కావెంజర్స్, ఇన్ శానిటరీ లెట్రిన్స్‌పై సర్వే

సుప్రీంకోర్టు, ఏపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో స్కావెంజర్స్, ఇన్ శానిటరీ లెట్రిన్స్ వివరాలపై సర్వే నిర్వహించనున్నట్లు కమిషనరు నల్లా రాంబాబు తెలిపారు. స్కావెంజర్స్, ఇన్ శానిటరి లెట్రిన్స్ ఉంటే వివరాలను ఈనెల 22న లోపు తెలియజేయాలన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి

రామాపురం : విద్యార్థి దశ నుంచే పోక్సో, పోస్ చట్టాలపై అవగాహన కలిగి వుండాలని రామాపురం ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు భారత దేశ చట్టాలు ఎంత కఠినంగా ఉన్నాయో తెలియజేశారు. చిన్నతనం నుంచే మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలన్నారు. విద్యార్థి దశలో వ్యామోహాలకు, ప్రలోభాలకు గురికాకూడదన్నారు. తమ ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థి దశ నుంచే చదువుపై ధ్యాస పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్యామలాదేవి, రెడ్డెప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చర్యలు

సుండుపల్లె : మండల కేంద్రంలో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని, దీని పరిష్కారానికి సుండుపల్లి ఎస్ఐ శ్రీనివాసులు టౌన్‌లో మంగళవారం పర్యటించి ప్రధాన రహదారులలో షాపుల యజమానులకు రోడ్లలో తమ వస్తువులను, వాహనాలను పెట్టరాదని సూచించారు. అలాగే తోపుడు బండ్లపై కూరగాయలు, పండ్లు, ఫాస్ట్‌ఫుడ్ వంటివి రోడ్లపై పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించరాదని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనాలను రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా ఉంచితే చలానాతోపాటు కఠిన చర్యలు తప్పవని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బీడీ నాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగలు, రూ. 40 వేలు నగదు చోరీ



క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

సుండుపల్లె : మండలకేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ వెనుక భాగం, కార్తికేయ నగర్‌లో ఇంట్లో దొంగతనం జరిగినట్లు బాధితులు ఫిర్యాదు చేసినట్లు రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ తెలిపారు. ఈనెల 13వ తేదీన తణుకు అంజనమ్మ, చంద్రశేఖర్ దంపతులు బెంగుళూరులో తమ బంధువులు వరలక్ష్మీ వ్రతం చేస్తుండటంతో అక్కడికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగతనం జరిగినట్లు సోమవారం రాత్రి ఇంటి పక్కన ఉంటున్న వారు గుర్తించి ఫోన్ ద్వారా సమాచారం బాధితులకు తెలియజేశారు. దీంతో ఇక్కడి చేరుకున్న బాధితులు బంగారు నగలు, రూ.40వేల నగదు చోరీ అవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు డాగ్ స్క్వాడ్, క్లూజ్ టీమ్‌తో పోలీసులు తనిఖీ చేశారు. అలానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సుండుపల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్ బిడి నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

సుండుపల్లె : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పింఛా ప్రాజెక్టు దిగువ భాగాన పింఛా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. రొంపిచెర్ల, పెనగలూరు తదితర మండలాల నుంచి వచ్చి ప్రతిరోజూ ప్రాజెక్టు దిగువ భాగంలోని నది నుంచి ఇసుక తరలిస్తున్నట్లు స్థానిక రైతులు ఇచ్చిన సమాచారం మేరకు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వారు తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు

చిట్వేలి : మండల పరిధిలోని కమ్మరాయుడు స్వామి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శిలాబింభ శిఖర ప్రతిష్ట మహోత్సవాలలో వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి మొదలైన ఉత్సవాలు రెండోరోజు మంగళవారం పూజా కార్యక్రమాలు, స్వామివారి గ్రామోత్సవం, మేళతాళాలు మధ్య కోలాటం కనుల పండువగా జరిపారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మహోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్టు రామ్మోహన్ రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

రామాపురం : మండల పరిధిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాత రెడ్డిచర్ల గంగాధర ఆర్థికసాయంతో మంగళవారం వృద్ధులకు అన్నదానం చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అన్నదానం గొప్ప పుణ్యకార్యమని తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, సభ్యులు పవన్‌కుమార్‌నాయుడు, భానుప్రకాష్, నందిని ట్రావెల్స్ వినోద్‌కుమార్‌నాయక్, దాత కుటుంబసభ్యులు, ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

23న 'ఉపాధి' గ్రామసభలు

రైల్వేకోడూరు అర్బన్ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు ఈనెల 23న కోడూరు మండలంలోని 22 పంచాయతీలలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సుబ్రమణ్యం మంగళవారం తెలిపారు. ఈ సభలలో గతంలో చేసిన పనులు, చేస్తున్న పనులపై చర్చిస్తామన్నారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2024-25 సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల ఆమోదానికి ఆగస్టు 23న మండలంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మంగళవారం మండల ఎంపీడీఓ రెడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గొల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు, మంటపంపల్లి, కోనరాజుపల్లిలో 10 గంటలకు, నడింపల్లిలో 10.30 గంటలకు, చింతరాచుపల్లి, గంగపేరూరు, పెన్నపేరూరులో ఉదయం 11.30 గంటలకు, కొండమాచుపల్లి, రాచగూడిపల్లిలో మధ్యాహ్నం 2 గంటలకు, కొత్తమాధవరం, నరవకాటిపల్లి, సాలాబాదు, ఒంటిమిట్టలో మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ సభలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

వీరబల్లి : మండలంలోని ఎనిమిది మంది రౌడీషీటర్లకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రౌడీయిజం మంచిది కాదని సూచించారు. ప్రతి ఒక్కరూ మంచిగా బతకడం నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు తెలియజేసేందుకే పొలంబడి



పొలంబడిలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజు

సిద్దవటం : మండలంలోని లింగంపల్లె గ్రామంలో మంగళవారం (గ్యాప్) పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ప్రతి శుక్రవారం రోజు 14 వారాలపాటు వరి పంటలో విత్తనం మొదలు కోత వరకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు 4 గంటల పాటు పొలంబడి నిర్వహిస్తారన్నారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని సూచించామన్నారు. పంట పర్యావరణ విశ్లేషణ నిర్వహించామన్నారు. మిత్ర, శత్రు పురుగుల గుర్తింపు, స్వల్పకాలిక దీర్ఘకాలిక ప్రయోగాలు చేయడం జరిగిందన్నారు. పురుగుల మందులు దుష్పరిణామాలు చార్టుపై గీసి వివరించినట్లు చెప్పారు. రైతులు అవగాహన స్థాయి తెలుసుకొనేందుకు బ్యాలెట్ బాక్స్ టెస్టు నిర్వహించామని అన్నారు. నారు కొనలు తుంచి నాటడం, కాలిబాటలు, సుడోమొనాస్ వినియోగం, ప్రకృతి వ్యవసాయ విధానాలు, జిగురు పూసిన పసుపు, తెలుపు, నీలం పల్లాలు, లింగాకర్షక బుట్టలు వంటి ఉత్తమ యాజమాన్య పద్ధతులను వివరించి, రైతు పొలాల్లో అమలుపరచి ధృవీకరణ చేయడం పొలంబడి ముఖ్య ఉద్దేశమన్నారు. తద్వారా రైతులు తమ ఉత్పత్తులను అధిక ధరలకు అమ్ముకొవచ్చని తెలియజేశారు. పొలంబడి 30 మంది రైతులు 25 ఎకరాల విస్తీర్ణంలో 2 ఎకరాల అధ్యయన క్షేత్రంలో నిర్వహించడం జరుగుతోందన్నారు. రైతులు పొలంబడిలో క్రమం తప్పకుండా పాల్గొని రైతు మేధస్సును పెంచుకొని ఆర్థిక పరమైన స్వయం నిర్ణయాలు తీసుకునే విధంగా రైతులు తయారు కావాలని, పొలంబడిని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సహాయకులు వంశీ శివఫణీంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నక్క, సింగరయ్య, ఐసీఆర్‌సీపీలు, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, లక్ష్మీదేవి, మాధవీలత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పుల్లంపేట : మండల పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు, ఏఎస్ఎం కళావతి, ఉపాధ్యాయురాలు శాంతకుమారి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తొట్లల్లో నీరు ఎక్కువరోజులు నిల్వలేకుండా ఉంచాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అలాగే భోజనం తిన్న తరువాత, తినక ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, గ్రామంలో ఎక్కడైనా మురుగుకుంటలు ఉంటే వాటిని శుభ్రం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గంగాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల విలువైన సమయం ర్యాలీలతో వృథా

గాలివీడు : ఎంతో ఉన్నత స్థాయికి ఎదగాలని పాఠశాలకు వచ్చే విద్యార్థులతో రకరకాల ర్యాలీలు, నిరసనల పేరుతో రోడ్డున పడేయడం అంటే వారి విలువైన సమయాన్ని వృథా చేయడమేనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ప్రతి రోజూ ఏదో ఒక సాకు చూపించి విద్యార్థులు ర్యాలీలు, నిరసనలు కార్యక్రమాలలో రోడ్డు పైకి వస్తున్నారు. అవగాహన ర్యాలీలు అంటూ విద్యార్థులను తీసుకెళ్లడం ఎంత వరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థి సంఘాల నుంచి స్వచ్ఛంద సంస్థల వరకు ఇలా ఎవరికి వారు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం విద్యార్థులను వాడుకుంటున్నారు. అదే ర్యాలీల్లో ఉద్యోగులు కానీ, సాధారణ ప్రజలు కానీ ఎవరూ కనపడరు. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారిని వివరణ కోరగా ఆయన సంబంధిత అధికారులకు నోటీసులు పంపి వివరణ కోరుతామని తెలియజేశారు.

వినియోగదారులు చైతన్యమవ్వాలి



ఆర్‌డీఓను సన్మానిస్తున్న ఏపీసీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు

రాయచోటి టౌన్ : వినియోగదారులు మోసపోకుండా ఎప్పటికప్పుడు చైతన్యమవ్వాలని రాయచోటి ఆర్‌డీఓ రంగాస్వామి అన్నారు. మంగళవారం ఏపీసీఆర్ఎఫ్ రాయచోటి డివిజన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ సంఘం జోనల్ ప్రెసిడెంట్ మేకల దర్బార్ బాషా, అన్నమయ్య జిల్లా వైస్ ప్రెసిడెంట్ దుగ్గనపల్లె సురేంద్రారెడ్డి, ఎడ్యుకేషనల్ విభాగం అధ్యక్షులు రవిశంకర్‌లు పాల్గొని సమాజంలో వినియోగదారులు తాము కొనుగోలు చేసే ప్రతి వస్తువును నాణ్యత ఉందా లేదాని పూర్తిగా పరిశీలన చేశాక కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆర్‌డీఓ రంగాస్వామిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, మణి, వెంకటేష్ నాయుడు, సిద్దయ్య పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థులకు భవిష్యత్తు



మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మంత్రి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. పట్టుదల, కృషితో దేనినైనా సాధించవచ్చన్నారు. కావున విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి



పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

చిన్నమండెం : మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ గణేష్ తెలిపారు. మండల పరిధిలోని 8680 ఆవులు, 450 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. మండలానికి 8200 డోసులు సరఫరా చేశామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆగని కాపర్ వైర్ దొంగల బెడద



బోర్లను ధ్వంసం చేసి కేబుల్ వైరు కట్ చేసి కాపర్ వైర్ ఎత్తుకెళ్లిన దొంగలు



కాపర్ వైరు కోసం మోటారు ధ్వంసం చేశారంటూ ఆవేదన పడుతున్న రైతు

లక్కిరెడ్డిపల్లి : బోరు మోటార్లలోని కేబుల్ వైరులో ఉండే కాపర్ వైరే లక్ష్యంగా దొంగల బీభత్సం రోజు రోజుకు మితిమీరిపోతోంది. మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె, మద్దిరేవుల గ్రామాలనే లక్ష్యంగా ఎంచుకొని వారం గడవక ముందే చోరీ జరిగిన చేనుల్లోనే రైతులకు వేసుకున్న బోర్లను ధ్వంసం చేసి కేబుల్ వైరు ఎక్కడికి అక్కడ కట్ చేయడంతోపాటు అందులో ఉండే కాపర్ వైర్‌ను ఇష్టానుసారంగా దొంగలించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులకు మునుపు జరిగిన వరుస దొంగతనాలతో రైతులు కొత్త కేబుల్ వైరు కొనుగోలు చేసి మోటార్లకు అమర్చినా తిరిగి సోమవారం రాత్రి కేబుల్ వైర్లను కట్ చేసి కాపర్ వైర్లను అపహరించినట్లు రైతులు తెలిపారు. దొంగలు మోటార్లను పాడు చేయడంతో వేలకువేలు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్న అరకొర నీటితో పంటలు సాగుచేసుకునే సమయంలో ఇలా మోటార్లను పాడు చేయడం, కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారం రోజుల క్రితం లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్ర బాబుకు ఫిర్యాదు చేసినట్లు రైతులు వెంకటసుబ్బయ్య, వెంకటేష్, వేణులు తెలిపారు.